


**పి. రామచంద్రరాజు**

"నా మాట విను మోహనా! ఈ దఫా నాకు వదిలెయ్. వచ్చే ఎన్నికల్లో నీ ఇష్టప్రకారమే పోటీ చేద్దువుగాని లే" కొడుక్కు నచ్చచెప్పాలని చూశాడు ఎమ్మెల్యే వీరారెడ్డి.

"నాకు యాభై ఏండ్లు దాటినాయి. బతికినన్నాళ్లు నువ్వే పదవులు అనుభవిస్తుంటే ఇక నాకు ఎప్పుడు అవకాశం వచ్చేది?" మోహన్ రెడ్డి, కృతనిశ్చయంతోనే తండ్రి మాటను అడ్డుకున్నాడు.

ఇద్దరికి టిఫిన్ వడ్డిస్తున్న మోహన్ రెడ్డి భార్య రాజేశ్వరి, వారి మధ్యలో కలుగజేసుకోకుండా వింటూ ఉంది.

"అట్లా ఎత్తుకుంటే ఆ కాకా చూడు, ఫెర్నాండేజ్ చూడు. రేపో మాపో రాలిపోతున్నట్లున్నా పోటీ చేయడం లేదా?"

"అదే రాలిపోతున్న వాళ్లకెందుకు రాజకీయం?"

"అర్జున్‌సింగ్ చూడు, నడవలేకున్నా, మాట్లాడలేకున్నా పోటీ చేయడంలే?"

"ఎవరినో చూపించి నన్ను మభ్యపెట్టకు!"

మోహన్‌రెడ్డి ప్రశ్నకు వీరారెడ్డి దగ్గర సమాధానం లేదు. అతడి వాదం న్యాయమైందే అంటే, ఇక రాజకీయాల నుండి వైదొలగడమే. అది వీలు గాని పని. ఇన్నాళ్లు తానింత హుషారుగా తిరుగాడుతున్నాడంటే అది రాజకీయాల నిషా. ఆ నిషా తలకెక్కినవాడు చచ్చినా అందులో నుండి బయటికి రావాలని కోరుకోడు. అదో మధురమైన ప్రపంచం. ఆ పూలదండలు, పొగడ్తలు, కేకలు, విందులు, వందనాలు, పాదాభివందనాలు, అనుచరులు, అర్భాటాలు, అదో తనివి తీరని మజా.

దాన్నుండి బయట పడడం మూడు పాతికలు దాటినా, నెహ్రూకూ వీలు కాలేదు. ఎనభై ఏండ్లు దాటినా బ్రహ్మచారి వాజ్‌పేయికీ సాధ్యం కాలేదు.

తను మోహన్‌రెడ్డికి గట్టిగా చెప్పకపోతే లెక్క చెయ్యడని ఆలోచించి, "కాంగ్రెస్ పార్టీలో నేనంటే సీనియరునని సీటిస్తారు. అదే నీకివ్వమంటే 'పిల్లోడికెందుకులే' అని ఆ బాలిరెడ్డి ఎగరేసుకుపోతాడు" అన్నాడు వీరారెడ్డి.

ముసలోడి అస్త్రానికి మోహన్‌రెడ్డి ఆలోచనలో పడి నీళ్లు నమిలాడు. ఇదే అదునుగా వీరారెడ్డి కొనసాగించాడు. "ఈ సారి మళ్లీ కాంగ్రెస్ రూలింగులోకి రావడం ఖాయం. రాజశేఖర్‌రెడ్డి కచ్చితంగా మంత్రి పదవి ఇస్తానని నాకు మాట కూడా ఇచ్చాడు."

"ఆ! మంత్రినవుదామని కలలు గంటూ ఉండు. ఆ డి.యస్. తన్నుకు పోడా సి.యం. పదవి? అయినా కాంగ్రెస్ మళ్లీ రూలింగులోకి వస్తాదని, అంత నమ్మకం ఎవరికీ లేదు, నీకు తప్ప. అవన్నీ నాకు తెలియదు. నాకు టికెట్ ఇప్పిస్తానంటే సరే. లేదంటే నేను తెలుగు దేశంలో చేరిపోతా. రామచంద్రయ్య, ఖలీల్ బాషా ముఖ్యమైనవాళ్లు ప్రజారాజ్యంలోకి పోయినారు. నేను వస్తే తెలుగు దేశం టికెట్ ఇప్పిస్తానని మైసూరారెడ్డి ఫోన్ చేశాడు" అన్నాడు. తండ్రితో అమీ తుమీ తేల్చుకునే దానికే సిద్ధపడ్డాడు మోహన్‌రెడ్డి.

వయసులోకి వచ్చినప్పటి నుండి ఎప్పుడెప్పుడు 'ఎమ్మెల్యే' అవుదామా, జీవితాశయం నెరవేర్చుకుందామా-అని ఎదురుచూసి ఎదురుచూసి ఇక లాభం లేదన్నట్లుగా, దేనికైనా తెగించి వున్నాడు మోహన్‌రెడ్డి, ఈ దఫా ఎన్నికల్లో పోటీ చెయ్యకపోతే తనకు అవకాశమే ఇకపై రాదన్నంత పట్టుదలగా ఉన్నాడు.

"నేను కాంగ్రెస్‌లో ఉండి, నువ్వు తెలుగు దేశంలోకి పోతే అందరూ నవ్వుతారు. నీ భవిష్యత్తు నాశనం చేసుకుంటావు. తెలుగుదేశానికి రూలింగులో కొస్తామనే ఆశల్లేకనే కె.సి. ఆర్‌ను, కమ్యూనిస్టులను బంగపడి పొత్తు పెట్టుకున్నాడు చంద్రబాబు. తొమ్మిదేండ్లు చంద్రబాబు రైతులను నాశనం చేసినాడు. ఒక్క ప్రాజెక్ట్ లేదు. ఉద్యోగం లేదు. మళ్లీ వచ్చేది కాంగ్రెస్. చూడు వై.యస్., జలయజ్ఞం, ఇందిరమ్మ ఇండ్లు, ఆరోగ్యశ్రీ, పావలా వడ్డీ..."

ఆయన కాంగ్రెస్ పార్టీ గొప్పతనాన్ని ఏకరువు పెడుతూ ఉంటే మోహన్‌రెడ్డికి వొళ్లు మండింది. "ఆ జలయజ్ఞం కాదు ధనయజ్ఞమనీ, ఆరోగ్యశ్రీ కార్పొరేట్ హాస్పిటల్స్‌తో ఒప్పందమనీ, ఇందిరమ్మ ఇండ్లు కాంట్రాక్టర్లకు వరమనీ, ఆ జూనియర్ ఎన్.టి.యార్ బాజా వాయిస్తున్నాడు గదా!" వీరారెడ్డికి ఎదురు చెప్పాలనే ఉద్దేశ్యంతో మాట్లాడాడు మోహన్ రెడ్డి.

"అవన్నీ మాట్లాడాల గాబట్టి, చంద్రబాబు చెప్పిస్తున్నాడు. అతగాడి మాటలు విని ఓట్లేసేదెవురు? సర్వేలు కూడా కాంగ్రెస్‌కు అనుకూలంగానే ఉందని చెపుతున్నాయి గదా! కాంగ్రెస్ రూలింగ్‌లోకి రావడం ఖాయం. నా మాట విను!" వీరారెడ్డి శతవిధాలా ప్రయత్నిస్తున్నాడు, మోహన్‌రెడ్డిని ఒప్పించాలని.

మోహన్‌రెడ్డికి, వీరారెడ్డి మాటలు రుచించనేలేదు. తనకు ఎమ్మెల్యే టికెట్ ఇస్తే తప్ప, ఏం చేసినా ప్రయోజనం లేదని మొండిగా గిరి గీసుకొని ఉన్నాడు.

"ఏదేమైనా, చంద్రబాబు నగదు పథకానికి కాంగ్రెసోళ్లంతా ఢమాల్ అయిపోతారని, మీడియా కూడా అతడికే కొమ్ము కాస్తోంది" తండ్రి చేత అస్త్రసన్యాసం చేయించాలని మోహన్‌రెడ్డి వాదం.

"అది అసాధ్యం! ఈ కలర్ టీవీలు, నగదు ఇస్తామంటే నమ్మేదెవరు?"

"చాలామంది నమ్ముకొని ఉన్నారు. బ్యాంకులో అకౌంట్లు కూడా తెరుస్తున్నారు అప్పుడే."

"ఆ కలర్ టీ.వీలు, నగదు పథకం అయినట్లే కలలు కనకు. చంద్రబాబు ఆశ అడియాసే!"

"ఎందుకు కాదు? ఇదేదో ఊహించే నేను చాలామందికి సెల్‌ఫోన్లు ఆల్‌రెడీ కొనిచ్చాను."

మోహన్‌రెడ్డి పేల్చిన బాంబుకు అదిరిపడ్డాడు ముసలాడు. "ఆఁ?" వీరారెడ్డికి నోట మాట రాలేదు.

"నువ్వు లక్ష సర్దిచెప్పినా ప్రయోజనం లేదు. నేనీ దఫా ఎన్నికల్లో నిలబడాలంతే!" చివరిగా చెప్పాడు మోహన్‌రెడ్డి.

ఎంత బుజ్జగించినా, ఎన్ని మాటలు చెప్పినా, తిరిగి తిరిగి అక్కడికే వచ్చిన కొడుకును చూసి, ఎగిసి తన్నాలన్నంత కోపం వచ్చింది వీరారెడ్డికి. "ఒరేయ్! చివరిసారిగా చెపుతున్నా, నాలాంటి సీనియరు ఉండగా కాంగ్రెస్‌లో నీలాంటి పిల్లోడికివ్వరు టికెట్!"

ఈ మాటల సందర్భంలోనే ఈ ప్రశ్నకు సమాధానం ఆలోచించి ఉన్నాడు మోహన్‌రెడ్డి. "హైదరాబాద్‌లో విష్ణుకూ, విజయవాడలో రాధాకృష్ణకూ టికెట్ ఇవ్వలేదా?" వీరారెడ్డి ఎంత తీవ్రంగా అన్నాడో మోహన్‌రెడ్డి అంతే కరుకుగా అడిగాడు.

కొడుకు వాదానికి నవ్వాలో ఏడవాలో, ఎక్కడ మాట జారి తిడితే అలిగి ఏం చేస్తాడో అని, కాసేపు నలిగిపోయాడు వీరారెడ్డి.

"వాళ్ల నాన్నలు చచ్చిపోతే..." వీరారెడ్డి మాట నోట్లో ఉండగానే కోపం నసాళానికి అంటి ఉన్న మోహన్‌రెడ్డి, రాకెట్ స్పీడుతో అన్నాడు, "అయితే నువ్వూ చచ్చిపో!"

ఇల్లంతా దద్దరిల్లేటట్లుగా పెద్దగా కేక వేశాడు మోహన్‌రెడ్డి. టికెట్ మీద పిచ్చితో ఉచితానుతాలు మరిచిపోయి అన్నాడు ఆ మాట.

ఈ మాటతో, వీరారెడ్డి నోటి మాట రాక అలా బొమ్మలా నిలబడిపోయాడు.

కొడుకు వాదానికి నవ్వాలో ఏడవాలో, ఎక్కడ మాట జారి తిడితే అలిగి ఏం చేస్తాడో అని, కాసేపు నలిగిపోయాడు వీరారెడ్డి. "వాళ్ల నాన్నలు చచ్చిపోతే..." వీరారెడ్డి మాట నోట్లో ఉండగానే కోపం నసాళానికి అంటి ఉన్న మోహన్‌రెడ్డి, రాకెట్ స్పీడుతో అన్నాడు, "అయితే నువ్వూ చచ్చిపో!" ఇల్లంతా దద్దరిల్లేటట్లుగా పెద్దగా కేక వేశాడు మోహన్‌రెడ్డి. టికెట్ మీద పిచ్చితో ఉచితానుతాలు మరిచిపోయి అన్నాడు ఆ మాట. ఈ మాటతో, వీరారెడ్డి నోటి మాట రాక అలా బొమ్మలా నిలబడిపోయాడు.

వంటగదిలో అంట్లు తోముతున్న కనకమ్మ ఆ కేకకు ఏమి జరిగిందోనని బయటికి వచ్చింది.

రూమును శుభ్రం చేస్తూవున్న వీరారెడ్డి నమ్మినబంటు నారాయణ ఒక్క ఉదుటున, డైనింగు హాలులో కొచ్చాడు.

ఇది గమనించిన రాజేశ్వరి, పనిమనుషుల దగ్గర చులకనైపోతామని "ఏంటండీ ఆ మాటలు?" అంటూ, మోహన్‌రెడ్డి కోపంతో బుసకొట్టడం చూసి దగ్గరికి వచ్చి, "మంచి నీళ్లు తాగండి" గ్లాసు అందించింది.

వీరారెడ్డి కళ్లల్లోకి కోపంగా చూస్తున్న మోహన్‌రెడ్డి, భార్య అందించిన గ్లాసును విసిరికొట్టాడు. నీళ్లు కిందపడి పెద్ద శబ్దంతో గాజు గ్లాసు ముక్కలైంది. అక్కడ ఏమి జరుగుతుందోననీ, తండ్రీకొడుకులు ఎక్కడ కొట్టుకుంటారోననీ, ఇంట్లోని వాళ్లు భయపడిపోయారు.

"ఈయనగారు బతికుండగా నాకు సీటు రాదు! ఎమ్.ఎల్.ఎ. ను కాలేను. ఈయన పోయేలోపల నా కొడుకు ఎదిగొచ్చి నాకు అడ్డుపడుతాడు. ఈయన కొడుగ్గా లేకపోయి ఉంటే నేను ఎప్పుడో ఎమ్.ఎల్.ఎ. అయివుందును!" కళ్లు తుడుచుకుంటూ బయటికి వచ్చేశాడు మోహన్‌రెడ్డి.

'ఈ ఐశ్వర్యము, హోదా, పలుకుపడి కొడుకుగా ఉండటం వలన వచ్చాయి-అనే విషయం ఈ నా కొడుకు ఆలోచించడా?' అనుకొని వీరారెడ్డి ఆలోచనలో పడి, తను కూడా మధ్యలోనే లేచాడు.

"తండ్రీనీ, కొడుకునూ విడదీసే ఈ రాజకీయాలు, ఎవరిని ఉద్ధరించడానికి మామయ్యా?" అంది రాజేశ్వరి కళ్లు వొత్తుకుంటూ.

ఊరూరా తిరిగి, ఎలక్షన్లకు అనుచరులను సమాయత్తం చేసి ఇల్లు చేరేటప్పటికి, రాత్రి పదకొండు దాటింది.

స్నానం చేసి నేరుగా డాబా మీది గదిలోకి వచ్చాడు. "అయ్యగారూ! రాజేశ్వరమ్మగారు భోజనానికి పిలుస్తున్నారు" అన్నాడు నారాయణ వచ్చి.

"ఆకలిగా లేదని చెప్పరా" అన్నాడు విసుగ్గా.

వాడు వెళ్లిపోయింతర్వాత కోడలు పైకి వచ్చి, "మామయ్యా గారూ కొంచెం తిందురు గానీ" అంది.

"లేదమ్మా బయటనే తినేశాను" అన్నాడు.

"అదేంటి మామయ్యా! ఊర్లో ఉంటే ఎప్పుడు కూడా బయట తినరు. ఈ రోజు కొత్తగా...?" ఆమె ఆశ్చర్యంతో అడిగింది. అదీగాక ఆయన కొడుకు మీద గుర్రుగా ఉండి భోజనానికి అలిగాడేమో అనుకుంది.

"అన్నం సహించలేదు గానీ, నీ మొగుడేమంటున్నాడో చెప్పు!" అడిగాడు వీరారెడ్డి, మనసులోని దిగులు దించుకుందామని. కొడుకు మనసు మార్చుకొని ఉంటాడని ఆశపడ్డాడు.

"మీతో వాదులాడి బయటికి పోయినాడు అంతే, రాత్రి తొమ్మిది గంటలకు వచ్చి బట్టలు సర్దుకొని వెళ్లిపోయాడు. ఎక్కడికి, ఎందుకు ఏమీ చెప్పలా. పాపను కూడా కసురుకున్నాడు" అంది రాజేశ్వరి.

"వాడికి పిచ్చి బాగా ముదిరిపోయింది. రాజకీయాలంటే తమాషాగా ఉంది!" అన్నాడు. అంతలోనే "నేనెటూ ఇందులోనే ఇరుక్కుపోయి వున్నానమ్మా. వచ్చినంతవరకూ బయటికి రాలేను!"

అన్నాడు.

మోహన్‌రెడ్డి చిన్నప్పటి నుండి ఆవేశపరుడు. ఈ రాజకీయం కోసం ఎక్కడ అఘాయిత్యం చేస్తాడో అని, ఆమె అనుమానిస్తూ ఉంది. ఆ విషయమే వీరారెడ్డితో చర్చించాలని, ఆమె వాకిలి దగ్గర ఆయన మాటలు వింటూ నిలబడింది.

"ఈ టికెట్ పిచ్చి ఆయన్ను ఎక్కడికి లాక్కుపోతుందో మామయ్యా! నాకు భయంగా ఉంది. ఆ రవీంద్రనాథ్‌రెడ్డి చూడండి. టికెట్ కోసం మీడియా ముందు బోరున విలపించాడు."



ఆమె మాట్లాడుతూ ఉండగానే, కనకమ్మ పాల గ్లాసు తెచ్చి వీరారెడ్డి మంచం పక్కన టీపాయ్ మీద పెట్టింది.

ఎందుకో ఆమె ఆ గ్లాసు పెట్టేటప్పుడు వణుకుతున్న శబ్దం అయింది. అది గమనించాడు వీరారెడ్డి.

"అయ్యగారూ, పాలు తాగండి" అంది కనకమ్మ, బెదిరిపోయినట్లుగా.

కనకమ్మ వైపు పరిశీలనగా చూశాడు వీరారెడ్డి. ఎపుడూ లేనిది కనకమ్మ పాల గ్లాసు ఎందుకు తెచ్చింది? రాత్రివేళ నిద్రబోయేముందు ప్రతి రోజూ నారాయణ పాలు తెచ్చి ఇస్తాడు. ఆయనలో అనుమానం మొలకెత్తింది. గ్లాసు వణకడం, కనకమ్మ గొంతు తడి ఆరిపోవడం గమనించాడు.

"ఏమే కనకం, రోజూ ఆ నారాయణ గదా పాలు తెచ్చేది? నువ్వు తెచ్చావేమిటీ? లోపల వాడేమైనాడు?" గద్దించాడు వీరారెడ్డి.

"అయ్యగారూ, నారాయణ, ఇప్పుడే వస్తా, నువ్వు పాలు పెట్టిరాపో అంటే..." భయపడిపోతూ చెప్పింది కనకమ్మ.

వీరారెడ్డి పాలు తాగకుండా గ్లాసును అనుమానంగా చూశాడు.

"ఎందుకు మామయ్యా, అంతగా ఆరా తీస్తున్నారు?" అంది రాజేశ్వరి, ఆయన వాలకానికి విస్తుపోతూ.

"ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మకూడదో, అన్నీ అనుమానాలేనమ్మా! కన్నకొడుకే 'చచ్చిపో' అంటే నేనేం చెయ్యాలి?" వీరారెడ్డి గద్గదస్వరంతో అన్నాడు.

"మన ఇంట్లోనివారినే మీరు అనుమానిస్తున్నారంటే నన్ను కూడా అనుమానించినట్లే మామయ్యా! వద్దు మీరింక ఇక్కడ నీళ్లు కూడా తృప్తిగా తాగలేరు. రేపే నేను మా పుట్టింటికి పోయి ఈ గొడవ సద్దుమణిగేంతర్వాత వస్తాను" అంది. ఆ పాల గ్లాసు దగ్గరికి వచ్చి, ఆయన అనుమానాన్ని పటాపంచలు చెయ్యాలని, దాన్ని ఎత్తిగటగట తాగింది ఆవేశంగా.

"అయ్యో! బిడ్డ లాంటి నిన్ను అనుమానించలేదమ్మా!" అని ఆమె పాలు తాగడం గమనించి, "ఆరెరె! నేను తరువాత తాగుతానమ్మా!" అన్నాడు, ఆ మాట అన్నందుకు విచారపడుతున్నట్లు.

"ఇంక వద్దు మామయ్యా! మీరు ఇంతగా అనుమానించిన తర్వాత..." ఆమె భోరున విలపిస్తూంది. "మీలో మా తండ్రిని చూసుకుంటూ ఉంటి..." మాటలు రాక వెక్కిళ్లు పెడుతూ అంది.

వీరారెడ్డి ఆమె మాటలకు కదిలిపోయాడు. 'పాపం! బయట ప్రపంచం ఎరుగని ఉత్తమురాలు. మా ఇద్దరి వాదులాటతో చాలా బాధ పడినట్లుంది' అనుకొని, ఆమెను అనునయించాలంటే ఏం చెప్పాలా-అని కాసేపు మాటల కోసం తడుముకున్నాడు.

ఇంతలో తల్లి ఏడుపు విని, మనవరాలు ఆ గదిలోకొచ్చి వీరారెడ్డి దిక్కు అనిష్టాపూర్వకంగా చూసింది. "మమ్ములను అందరిని ఏడిపించి ఆ రాజకీయాలు నెత్తిన పెట్టుకొని పోతావా ముసలోడా?" అంది, తల్లి తల మీద చేయి వేసి ఓదారుస్తూ. "వాళ్ల మధ్య నువ్వెందుకు ఏడవడం?"

ఎంతైనా తల పండిన ముసలోడు కదా. కొడుకు. టికెట్ మీద పిచ్చి ఏ పని అయినా చేయించవచ్చు అని సంశయించాడు. ఆస్తి కోసం అన్నదమ్ములు చంపుకొంటున్నారు. ఆడదాని కోసం పెళ్లాం బిడ్డలను కాదనుకొన్న వారిని గురించి తెలుసు. ఎన్నికల్లో గెలవాలని ప్రత్యర్థులను మట్టుబెట్టడం తెలుసు. ఈ రాజకీయం పిచ్చిపట్టిన వాళ్లకు దాని కోసం ఎంతవరకైనా తెగించిన ఉదంతాలు చాలా వరకు వీరారెడ్డి మనసులో మెదులుతున్నాయి. అయినా సరే, సీటు వదలాలంటే మనసొప్పడం లేదు. చావు బతుకుల్లో ఉన్నావు నీకు టికెట్ లేదు అని జార్జి ఫెర్నాండెజ్‌ను తప్పుకోమంటే, "నేను జైల్లో ఉండే గెలిచాను. ఈ సారి కూడా చచ్చినా సరే, తిరిగి గెలుస్తాను"

అని స్వతంత్రంగా పోటీ చేస్తున్నాడు. అంటే చచ్చినా రాజకీయాలు వదలరన్నమాట!

రాజేశ్వరి ఏడుపుతో ఆలోచనలో పడిన వీరారెడ్డి, మనవరాలి మాటలు గుండెల్లో గుచ్చుకొని విలవిల్లాడాడు.

ఐదు నిమిషాలు గడిచాయి.

రాజేశ్వరి పొగిలి పొగిలి ఏడ్చి కూతురు చెయ్యి పట్టి లాగుతుంటే వాకిలి దాటబోతూ, మైకంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. అది పాలలోని విషం ప్రభావం!

"నలభై ఏండ్ల నా నమ్మకం వమ్ము చేశావు గదరా రాస్కెల్!" నారాయణ చెంప మీద దెబ్బ వేసి, కాళ్లతో తంతూ తిట్టాడు వీరారెడ్డి.

" 'పాలల్లో విషం కలపకపోతే భార్యాబిడ్డలను చంపేస్తాను' అన్నాడు గదయ్యా మోహన్‌రెడ్డి! పోలీస్ కేసు లేకుండా చూసుకుంటా, నిద్రలో గుండె పోటుతో చచ్చాడని డాక్టర్‌తో చెప్పిస్తానని చెప్పాడయ్యా నాకు భయమేసి, కనకమ్మను పాలు తీసుకుపొమ్మని చెప్పానయ్యా!" అని నారాయణ ఏడ్చి చెపుతూ ఉంటే, వీరారెడ్డి గుండె వెయ్యి ముక్కలు అయింది.

ఇంక ఏమీ మాట్లాడకుండా నేరుగా రూములో కొచ్చి లెటర్ ప్యాడ్ మీద రెండు లైన్లు రాసి, సంతకం చేసి, విలేఖరులకు పంపించాడు.

"ఇన్నేండ్లుగా నా మీద అభిమానం చూపించినవారందరికీ నా కృతజ్ఞతలు. వయోభారంతో నేను రాజకీయాల నుండి శాశ్వతంగా వైదొలగుతున్నాను. నా కొడుకు మోహన్ రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించమని ప్రజలను వేడుకుంటున్నాను!"